# అమ్మవారు

– శ్యామలాదేవి దశిక, **North Brunswick, NJ**

ఏమిటీ అంటున్నారూ? అమ్మవారు అచ్చం లక్ష్మీదేవిలా వుందా?

బూరెలూ, గారెలూ అసలైన ఆకారాల్లో వున్నాయా?

ఏదీ కాస్త వెసులుబాటుగా, తాపీగా చేసుకున్నది ఈ ఏడాదేగా!

అప్పట్లో పెళ్ళైన వెంటనే మీతో అమెరికా వచ్చేయడంతో నా మొట్టమొదటి వరలక్ష్మీ వ్రతం ఇక్కడే జరిగింది.

ఇండియా నుంచి ఉత్తరం వచ్చింది, ఫలానా రోజు వరలక్ష్మీ వ్రతం పూజ చేసుకో అని. పూజ చేసుకోమని రాసారు కానీ ఎలా చేసుకోవాలో, ఏంచెయ్యాలో రాయలేదు.

పీచులేని కొబ్బరికాయకు రవికెలగుడ్డ ఎలా పెట్టాలో తెలీలేదు.

నేను చేసిన అమ్మవారిని చూసి మీరు పడీ పడీ నవ్వటం మొదలుపెట్టారు!

మీ నవ్వు చూసి నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది.

మనం వుంటున్న కేంపస్‌లో మనవాళ్ళు ఎవరూ లేకపోవడంతో పళ్ళూ-సెనగలూ తీసికెళ్ళి మనపక్కనే వుంటున్న మార్గరెట్‌కు ఇచ్చాను. ఆవిడ చాలా మురిసిపోతూ తీసుకుంది! ఆవిడ మర్నాడు సెనగల్ని సాలడ్‌లో వేసుకున్నానని చెప్పింది. గుర్తుందా ?

ఆతర్వాత పిల్లలు సంసారంలో మునిగిపోయాం. నా అమ్మవార్ని ఎక్కడ పెట్టినా పిల్లలు పీకేసేవారు. బాబిగాడైతే సరేసరి.

ఒకసారి అమ్మవారికోసం చేసిపెట్టిన పిండిని వాడి చిట్టిచేతులతో శుబ్బరంగా పిసికేసి తినేశాడు గుర్తుందా?!

మీకెక్కడ గుర్తుంటుందిలేండి !

ఓ ఏడాది కొబ్బరికాయమీద రెవికల గుడ్డ అమరుస్తుంటే నా కొడుకు బంగారు తండ్రి రాజా 'వాటీజ్ దట్?' అంటూ అడిగాడు. నేను ఈరోజు ఆవిడ బర్తుడే అని అందుకని స్పెషల్ హాట్ పెడుతున్నానని చెప్పాను.

అప్పటికి అర్థమైనట్లే బుర్ర ఊపి నేను అటు వెళ్ళగానే ఆ రవికల గుడ్డ తీసేసి వాడి బర్తుడే హాట్ తెచ్చి పెట్టాడు!

నేను తీసేయబోతుంటే ఏడుపు లంకించుకున్నాడు.

మీరు 'పోనీలే వుండనీ, నువ్వు పెట్టిన జాకెట్టు గుడ్డ కన్నా ఇదేబావుంది' అని నవ్వడం మొదలుపెట్టారు!

వాడిని శాంతింపజేయటానికి ఆ రోజు బూరెలతో పాటు బర్తుడే కేక్ కూడా నైవేద్యం పెట్టాను!

పెద్దవాడు ఎంత నెమ్మదో బాబిగాడు అంత కొంటె కోణంగి!

వాడికి అన్ని మీ బుద్ధులే వచ్చాయి.

నా అమ్మవార్ని ఏదోఒకటి అనందే వాడికి తోచేది కాదు!

మామ్ - షి లుక్స్ డిప్రెస్సుడ్, మామ్ - షి లుక్స్ స్కేరీ లైక్ మై సైన్స్ టీచర్, మామ్ - షి లుక్స్ వీర్డ్ -----ఇలా.

తప్పురా అలా అమ్మవార్ని అనకూడదురా అంటే, 'ఐ యామ్ నాట్ సేయింగ్ ఎనీ థింగ్ ఎబౌట్ హెర్, ఐ యామ్ సేయింగ్ యూ నీడ్ లాట్సాఫ్ ప్రాక్టీస్!' అంటూ పారిపోయేవాడు.

ఇలా వంకలు పెడుతూనే ఆ రోజు నేను చేసినవన్నీ లాగించేవాడు !

వాళ్ళ ఇద్దరి తర్వాత అమ్మాయి, రాణీగారు!

అడిగినవన్నీ కొనిచ్చి గారాబం చేసి నెత్తిమీద ఎక్కించుకున్నారు.

అమ్మవారికి ఏనగలు పెట్టబోయినా 'దెఆర్ మైన్, షి కేంట్ హేవ్ దెమ్' అంటూ లాగేసుకునేది!

కొంచెం పెద్దదైన తర్వాత ఏదో కాస్త నేర్చుకుంటుందన్న ఆశతో సాయం అడిగేదాన్ని. విసుక్కుంటూ వచ్చేది.

ఒకసారి దాని ఫ్రెండుతో దెబ్బలాడి ఏమీ తోచక కిందికొచ్చి 'ఐ విల్ మేక్ హెర్ రెడీ యూ గో' అంటూ నన్ను తరిమేసింది. కాసేపయిన తర్వాత చూద్దును కదా! రామ రామ---

ఇదేమిటే ఇలా చేసావు? అంటే 'వాట్ మామ్, షి లుక్స్ కూల్!' అంటూ తను ముస్తాబు చేసిన అమ్మవార్ని చూసుకుని మురిసిపోయింది. అప్పటినుంచి ఇక ప్రతి ఏడాది దాని ఇష్టంవచ్చినట్లు అలంకరించేది!

నేను అమ్మవారికి జడవేస్తే 'దటీజ్ ఓల్డ్ ఫాషన్ మామ్, షి ఈజ్ ఇన్ అమెరికా!' అంటూ నామాట లెక్కచెయ్యకుండా రకరకాల హెయిర్ స్టైల్స్ చేసేది!

పైగా దాని ఫ్రెండ్స్‌ని పిలిచి చూపించుకునేది!

నేను మొదటిసారి అమ్మవార్ని చేస్తే 'ఈవిడ అమ్మవారిలా లేదు. నీలాగా కాలేజ్ గర్ల్'లా వుందని ఏడిపించారు గుర్తుందా ?! తర్వాత మన అమ్మాయి చేతిలో అమ్మవారు టీనేజ్ గర్ల్‌లా వుందనిపించేది నాకు!

కానీ మీఅమ్మాయి చేసిన అమ్మవారు మీకళ్ళకు బాగానే వుండేది, 'గుడ్ జాబ్ షి లుక్స్ ఆసమ్' అంటూ కూతుర్ని పొగిడేవారు!

ఏమిటోనండి కన్నుమూసి కన్ను తెరిచేంతలో పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు. ఎవరి బతుకులు వాళ్ళు బతుకుతున్నారు.

కిందటేడాది అమ్మాయి కూడా పెళ్ళిచేసుకుని దానింటికి అది వెళ్ళిపోయింది.

నాకు మాత్రం మునపటి అమ్మవారే బావుందనిపిస్తోంది !

నా పిల్లలు ఆవిడ నెత్తిమీద బర్తుడే హాటులు పెట్టినా, మెళ్ళో స్కార్ఫ్‌లు చుట్టినా, గిల్ట్ నగలు పెట్టినా, కేకులు నైవేద్యాలు పెట్టినా ఆ తల్లి ఏమీ అనుకోలేదు. ఆ దేవి అనుగ్రహంతోనే ముగ్గురూ ఎవరూ వేలెత్తి చూపించకుండా పెరిగారు. చక్కగా ఎదిగారు!

అంతకన్నా మనకు ఇంకేం కావాలండీ---

కానీ పిల్లలు లేని ఇల్లు బోసిగా వుందండీ---

ఏమిటీ కొన్నాళ్ళకు మన మనవలూ, మనవరాళ్ళతో నా అమ్మవారికి మునుపటి కళ వచ్చేస్తుందా?

ఎంత తియ్యని మాట చెప్పారండీ!!

అత్తకడుపు చల్లగా ---అమ్మ కడుపు చల్లగా ---

ఇదిగో ఈ పూర్ణం బూరె తినండి---

***